సాక్షి
కామారెడ్డి

బుధవారం । 9 । అక్టోబర్ । 2024





### కబళించిన వాహనాలు

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు బాలురను వాహనాలు కబళించాయి. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

- 2లో ▸



### ప్రజలకు అండగా ఉంటా

ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 3లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.9 /21.3

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### స్వదేశీ మేళా కరపత్రాల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్‌: హైదరాబాద్‌లోని పీపుల్స్‌ ప్లాజాలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు స్వదేశీ మేళా నిర్వహించనున్నారు. స్వదేశీ జాగరణ్‌ మంచ్‌, స్వావలంబి భారత్‌ అభియాన్‌ రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మేళాను సందర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్‌, ఎస్‌జేఎం ప్రాంత ప్రచార ప్రముఖ్‌ కేశవ్‌ సోని, ఇందూర్‌ విభాగ్‌ కోఆర్డినేటర్‌ రాజాగౌడ్‌, జిల్లా కన్వీనర్‌ రాహుల్‌, ప్రతినిధులు యాలాద్రి, మనీష్‌, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సబ్‌ కలెక్టర్‌కు ఆర్టీసీ బహుమతి



బాన్సువాడ : సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయిని మంగళవారం బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరితాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు సంస్థ తరపున దసరా కానుకను అందించినట్లు డీఎం తెలిపారు. ఆమె వెంట డిపో సూపరింటెండెంట్‌ బసంత్‌ ఉన్నారు.

### బీర్కూర్‌లో నేలకొరిగిన వరి



బాన్సువాడ : బీర్కూర్‌ మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో వరి పంట నేలకొరిగింది. వారం పది రోజుల్లో చేతికొచ్చే పంట నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఎల్లారెడ్డిలో ఐటీ కారిడార్..!

- ప్రయత్నాలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- 50 ఎకరాల స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు లేఖ
- వేలాది మందికి ఉపాధి లభించే అవకాశం
- గ్రామీణ ప్రాంత యువతకు అనుకూలం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మెట్రో నగరాలకే పరిమితమైన ఐటీ రంగాన్ని మారుమూల ప్రాంతాలకు విస్తరించడం ద్వారా స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. దీంతో వేలాది మంది లబ్ధిపొందే అవకాశాలు ఏర్పడతాయి. అంతేగాక ఐటీ కారిడార్‌ ఏర్పాటుతో ఆయా ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయి. ఈ విషయాన్ని గ్రహించిన సాఫ్ట్‌వేర్‌ పారిశ్రామిక రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎల్లారెడ్డి కేంద్రంగా ఐటీ కారిడార్‌ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో కావాల్సినంత ప్రభుత్వ స్థలం ఉండడంతో ఆ ప్రాంతంలో 50 ఎకరాల భూమి అప్పగిస్తే ఐటీ కారిడార్‌కు కావలసిన ప్రయత్నాలు చేస్తానని ఆయన చెబుతున్నారు. ఇదే విషయంపై కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌కు ఇటీవల లేఖ రాశారు. ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని 1406 సర్వే నంబరులో 50 ఎకరాల స్థలం ఇవ్వాలని కోరారు. ఈ భూమి ఎన్‌హెచ్‌ 161, అలాగే కొత్తగా నిర్మితమవుతున్న 765డి జాతీయ రహదారులకు సమీపంలో ఉండడంతో ఐటీ పారిశ్రామిక రంగ రవాణాకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

**పరోక్షంగానూ..**

ఐటీ కారిడార్‌ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. హోటళ్లు, దుకాణాలు, రవాణా తదితర రంగాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా ఈ ప్రాంతంలో వ్యాపార అభివృద్ధి జరుగుతుంది. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రయత్నాలు ఫలించాలని ఈ ప్రాంత యువత ఆకాంక్షిస్తోంది.

### స్థలం కేటాయిస్తే..

ఎల్లారెడ్డి పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే ఐటీ కారిడార్‌ ఏర్పాటుకు అడుగులు పడనున్నాయి. ఐటీ రంగంపై అవగాహన ఉండడంతో పాటు విస్తృత పరిచయాలు ఉండడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎల్లారెడ్డిలో ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. అందుకు కావలసిన ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్‌ రింగ్‌ రోడ్‌ నుంచి నర్సాపూర్‌, మెదక్‌ మీదుగా ఎల్లారెడ్డి, బాన్సువాడ, రుద్రూర్‌ వరకు 765 డీ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే మెదక్‌ వరకు పనులు పూర్తయ్యాయి. మరో ఏడాది రెండేళ్లలో ఎల్లారెడ్డి, బాన్సువాడ రోడ్డు పనులు కూడా పూర్తవుతాయి. దీంతో హైదరాబాద్‌ నుంచి రాకపోకలకు పెద్దగా ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే 161 జాతీయ రహదారి ఓఆర్‌ఆర్‌ నుంచి సంగారెడ్డి, జోగిపేట్‌, పిట్లం మీదుగా దెగ్లూర్‌ వరకు పనులు పూర్తయ్యాయి. అటు వైపు నుంచి కూడా రాకపోకలకు అనుకూలంగా ఉంది. హైదరాబాద్‌ నుంచి ఎల్లారెడ్డికి గంటన్నర రెండుగంటల్లో చేరుకోవచ్చు.

### స్థానికులకు అవకాశాలు

ఐటీ రంగంలో పెద్ద ప్యాకేజీలతో ఉద్యోగాలు కొందరికే లభిస్తాయి. సాధారణ ప్యాకేజీలతో ఉద్యోగాలు చేసేవాళ్లే ఎక్కువ మంది ఉంటారు. కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌తో పాటు ఇతర సాఫ్ట్‌వేర్‌ కోర్సులు నేర్చుకున్నవారు వేలాది మంది హైదరాబాద్‌లో అరకొర జీతాలతో పనిచేస్తున్నారు. ఎల్లారెడ్డిలో సాఫ్ట్‌వేర్‌ కంపెనీలు ఏర్పాటైతే హైదరాబాద్‌లో తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఇక్కడివారు సొంతూరుకు వచ్చే అవకాశాలున్నాయి. మారుమూల ప్రాంతంలో ఐటీ కారిడార్‌ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత యువత ఎక్కడికో వెళ్లకుండా స్థానికంగా ఉద్యోగాలు చేసుకునే అవకాశాలు మెరుగుపడతాయి.

### హర్షించదగ్గ విషయం



ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన ఎంతోమంది సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తున్నారు. పట్టణంలోనే ఐటీ కారిడార్‌ ఏర్పాటు చేస్తే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాకుండా స్థానికంగా చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఐటీ కారిడార్‌ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రయతిస్నుస్తుండడం హర్షించాల్సిన విషయం.

– అర్జున్‌ చక్రవర్తి, సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి, ఎల్లారెడ్డి

### అభివృద్ధి జరుగుతుంది



గ్రామీణ ప్రాంతంలో ఐటీ కారిడార్‌ ఏర్పాటు వల్ల చాలా మందికి ఉపాధి లభిస్తుంది. దీని వల్ల ఎల్లారెడ్డి ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడే సాఫ్ట్‌వేర్‌ కంపెనీలు ఏర్పాటయితే గ్రామీణ ప్రాంతంలో ఉంటూ ఉద్యోగాన్ని చేసుకునే అవకాశం లభిస్తుంది. ఐటీ కారిడార్‌ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు.

– చందుపట్ల రోహిత్‌, సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి, ఎల్లారెడ్డి

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి



కల్కి చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం
- కల్కి చెరువులో చేపపిల్లల విడుదల
- చేప పిల్లల సైజు తక్కువగా ఉండడంతో అధికారులపై ఆగ్రహం

బాన్సువాడ : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తోందని, అయితే అధికారుల నిర్లక్ష్యంతో సర్కారు లక్ష్యం నీరుగారిపోతోందని వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ కల్కి చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయితో కలిసి ప్రారంభించారు. చేప పిల్లలు చిన్న సైజులో ఉండడంతో మత్స్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చేప పిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తక్కువ సైజులో ఉన్న చేప పిల్లల్ని చెరువుల్లో విడుదల చేస్తున్నారని ఆరోపించారు. చిన్న సైజు చేపపిల్లలను చెరువుల్లో విడుదల చేస్తే ఎక్కువ శాతం చనిపోతాయని, దీంతో మత్స్యకారులు నష్టపోతారని పేర్కొన్నారు. చేప పిల్లలు 80 మిల్లీమీటర్ల నుంచి 100 మిల్లీ మీటర్ల వరకు ఉండాలన్నారు. తక్కువ సైజులో ఉన్న చేప పిల్లలను తిప్పి పంపించాలన్నారు. బాన్సువాడ కల్కి చెరువులో లక్షా 71 వేల చేప పిల్లలను విడుదల చేయాలన్నారు. సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ జంగం గంగాధర్‌, జిల్లా ఫిషరీస్‌ అధికారి శ్రీపతి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గాదం సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, బాన్సువాడ గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గిర్మి కృష్ణ, ఓట్లంగారి లక్ష్మణ్‌, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్‌, నార్ల సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో కలిసి కోలాటం ఆడుతున్న కలెక్టర్‌ సంగ్వాన్‌

## సంబురంగా బతుకమ్మ

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌ ఆవరణలో తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ పాల్గొని కోలాటం ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ గొప్ప పండుగ అన్నారు. మహిళల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమన్నారు. పలు శాఖల ఉద్యోగినులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌, టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆయా సంఘాల ప్రతినిధులు సాయిరెడ్డి, సంతోష్‌, శివకుమార్‌, పోచయ్య పాల్గొన్నారు.



బతుకమ్మతో మహిళా ఉద్యోగి

## డీఎస్సీ తుది జాబితా వెల్లడి

- నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత
- త్వరలో వెబ్‌ ఆప్షన్‌కు అవకాశం

కామారెడ్డి టౌన్‌: డీఎస్సీ–2024 అర్హుల జాబితాను విద్యాశాఖ అధికారులు మంగళవారం వెల్లడించారు. జిల్లాలో మొత్తం 506 పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహించగా.. ఇప్పటివరకు 476 మందిని ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హులుగా గుర్తించారు. ఇంకా 30 పోస్టులకు అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ పోస్టులను రోస్టర్‌ ప్రకారం ఎంపిక చేయాల్సి ఉంటుందని, దీంతో వీటి భర్తీ కాస్త ఆలస్యం అవుతుందని డీఈవో రాజు తెలిపారు. ఎంపికైన వారికి బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామక పత్రాలను అందిస్తారని పేర్కొన్నారు. వీరంతా హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి 9 బస్సులు హైదరాబాద్‌కు బయలుదేరుతాయని, ఎంపికైనవారు సకాలంలో చేరుకోవాలని డీఈవో సూచించారు.

**దసరా తర్వాతే..**

డీఎస్సీ– 2024 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలో వెబ్‌ ఆప్షన్లను ఇవ్వనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలుగా ఉన్న పోస్టులను చూపించి వెబ్‌ ఆప్షన్ల ద్వారా స్థానాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తారు. దసరా సెలవుల తర్వాతే వెబ్‌ ఆప్షన్లను ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

### నాడు జెడ్పీటీసీ.. నేడు టీచర్‌



పిట్లం(జుక్కల్‌): మొన్నటి వరకు జెడ్పీటీసీగా సేవలందించిన ఆమె.. నేడు విద్యార్థులను తీర్చిదిద్దే గురవయ్యారు. డీఎస్సీ–2024లో అర్హత సాధించి ఎస్జీటీ కొలువు సాధించారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని దేవిసింగ్‌ తండాకు చెందిన చంద్రబాగ 2019 ఎన్నికలలో జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. ప్రజాప్రతినిధిగా ఐదేళ్లు ప్రజలకు సేవలందించారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ప్రతిభ చూపి ఎస్జీటీగా ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందుకోనున్నారు. ఉపాధ్యాయ కొలువుకు ఎంపికైన చంద్రబాగను గ్రామస్తులు, నాయకులు, అధికారులు అభినందిస్తున్నారు.

**వివిధ కేటగిరీలలో భర్తీ అయిన పోస్టులు..**

| కేటగిరి | పోస్టులు | భర్తీ అయినవి |
|---|---|---|
| స్కూల్‌ అసిస్టెంట్‌ | 121 | 119 |
| లాంగ్వేజ్‌ పండిట్‌ | 15 | 13 |
| పీఈటీ | 5 | 5 |
| ఎస్జీటీ | 318 | 305 |
| ఎస్‌ఏ (స్పెషల్‌) | 11 | 00 |
| ఎస్జీటీ(స్పెషల్‌) | 36 | 34 |
| మొత్తం | 506 | 476 |

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలి
- కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌

కామారెడ్డి క్రైం: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సొసైటీల సీఈవోలు ఐకేపీ సెంటర్‌ ఇన్‌చార్జీలు, వ్యవసాయ శాఖ వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులకు ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని పరిశీలించి సన్న రకం, దొడ్డు రకం వడ్లను వేరువేరు బస్తాలలో నింపాలని సూచించారు. ప్రతి సంచిపై సెంటర్‌ కోడ్‌, జిల్లా కోడ్‌ వేయాలన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు ప్రతి కేంద్రంలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేశాక ట్యాగ్‌ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలన్నారు. ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సెంటర్లలో నిల్వ చేయరాదన్నారు. ధాన్యం తేమ శాతం, ధాన్యం పరిశీలన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్‌, పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌ రాజేందర్‌, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

**బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలి**

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలను అధికారికంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ అధికారులకు సూచించారు. బతుకమ్మ వేడుకల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారిక వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. మహిళా సంఘాల సభ్యులను బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములను చేయాలన్నారు. చెరువులు, కుంటలు తదితర ప్రాంతాలలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. బతుకమ్మ ఆడే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని, టెంట్‌లు వేయాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, డీపీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్‌ కమిషనర్‌ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న బడికి చేయూతనందిస్తా

- ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దుతా
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



రామారెడ్డి: తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న రామారెడ్డిలోని సర్కారు బడికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఆయన రామారెడ్డి పాఠశాలలో చదువుకున్నారు. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పందించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తాను చదువుకున్న బడితోపాటు నియోజకవర్గంలోని అన్ని సర్కారు బడులను అభివృద్ధి చేయడానికి తన వద్ద స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయన్నారు. రామారెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పాఠశాలను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అలాగే రామారెడ్డి మండల కేంద్రానికి సంబంధించి ఒకటే వైకుంఠధామం ఉండడంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్న అంశంపై 'సాక్షి'లో 'ఆఖరి మజిలీకి అవస్థలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపైనా ఎమ్మెల్యే స్పందించారు. మండల కేంద్రంలో మరో వైకుంఠధామం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.

## ఓటరు జాబితా రూపొందించండి

కామారెడ్డి క్రైం: త్వరలో ఖాళీ కానున్న టీచర్స్‌, గ్రాడ్యుయేట్స్‌ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం నిబంధనల ప్రకారం ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, కరీంనగర్‌, మెదక్‌ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు వచ్చే మార్చిలో ఖాళీ కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ స్థానాలు, ఓటరు నమోదుపై ఈనెల 16, 25 తేదీలలో వార్తా పత్రికలలో నోటీసులు ఇవ్వాలన్నారు. అర్హులైనవారు నవంబర్‌ 6 వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటరుగా నమోదైనవారూ తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ దరఖాస్తులకు సంబంధిత సర్టిఫికెట్లను జత చేసి తహసీల్‌ కార్యాలయం, రెవెన్యూ డివిజన్‌ అధికారి కార్యాలయంలలో అందించాలన్నారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్‌ 23 న డ్రాఫ్ట్‌ ఓటర్‌ జాబితా ప్రచురించాలని, డిసెంబర్‌ 9 లోపు డ్రాఫ్ట్‌పై అభ్యంతరాలను స్వీకరించి డిసెంబర్‌ 25 లోపు పరిష్కరించాలని, డిసెంబర్‌ 30న తుది ఓటర్‌ జాబితా ప్రచురించాలని కలెక్టర్లకు సూచించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు జాబితా రూపొందించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై కలెక్టర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లానుంచి కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌, అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాకు జలశక్తి అభియాన్‌ బృందం రాక

కామారెడ్డి క్రైం: జిల్లాలో కేంద్ర జలశక్తి అభియాన్‌ కింద చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించడానికి కేంద్ర పవర్‌ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రెటరీ బెంజమిన్‌ కరుణాకరన్‌ ఆధ్వర్యం జలశక్తి బృందం జిల్లాకు చేరుకుంది. వారికి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జలశక్తి కార్యక్రమం కింద వివిధ శాఖల ద్వారా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. గ్రామీణాభివృద్ధి, గ్రౌండ్‌ వాటర్‌, అటవి, నీటి పారుదల, వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై కేంద్ర బృందం సమీక్షించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలను డీఆర్‌డీవో సురేందర్‌ వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆచార్య శ్రీకృష్ణ పవార్‌, అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్‌వో నిఖిత, జెడ్పీ సీఈవో చందర్‌, డీపీవో శ్రీనివాస్‌రావు, ఇరిగేషన్‌ అధికారి శ్రీనివాస్‌, ఉద్యానశాఖ అధికారి జ్యోతి, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌

## క్లుప్తంగా

### ఎస్సారెస్పీ నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం నాలుగు వరదగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 34,086 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మి కాలువ ద్వారా 150, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

### శ్రీవారిని దర్శించుకున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



నిజామాబాద్ సిటీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం నైవేద్య విరామసమయంలో దర్శనానికి వెళ్లిన వారికి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

# చిన్నారులను కబళించిన వాహనాలు

- కామారెడ్డి జిల్లాలో ట్రాక్టర్ కిందపడి ఐదేళ్ల బాలుడు..
- నిజామాబాద్ జిల్లాలో టాటా ఏస్ ఢీకొని ఏడేళ్ల బాలుడి మృతి

అభంశుభం తెలియని చిన్నారుల ప్రాణాలను వాహనాలు కబళించాయి. ట్రాక్టర్ ట్రాలీ మీదపడి కామారెడ్డి జిల్లాలో ఐదేళ్ల బాలుడు మృతి చెందగా, టాటా ఏస్ వాహనం ఢీకొని నిజామాబాద్ జిల్లాలో ఏడేళ్ల బాలుడు కన్నుమూశాడు. రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..



ఘటనాస్థలంలో ట్రాక్టర్



రిషికేశ్ మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్ చెరువు ముందు తండాలో ట్రాక్టర్ కిందపడి రిషికేశ్(5) అనే బాలుడు మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోనాల్ చెరువు ముందు తండాకు చెందిన రమావత్ భాస్కర్ తన ట్రాక్టర్‌ను రోజులాగే పార్క్ చేసి ఉంచాడు. ఆ స్థలంలో దిగుడు ఉండడంతో గేర్ వేసి ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. దురదృష్టవశాత్తు ఆయన కుమారుడు రిషికేశ్ ఆడుకుంటూ ట్రాక్టర్‌పైకి ఎక్కి గేర్ తీయడంతో ముందుకు వెళ్లిన ట్రాక్టర్ గుంతలోపడిపోయింది. ట్రాక్టర్‌పై ఉన్న రిషికేశ్ ఎగిరి కింద పడిపోగా, అతడిపై ట్రాలీ పడడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు మృతి చెందడంతో భాస్కర్‌తోపాటు ఆయన భార్య నిర్మల తల్లడిల్లిపోయారు. వారి రోదన తండావాసులను కంటతడి పెట్టించింది.

### భీమ్‌గల్‌లో..



నిశ్వంత్ మృతదేహం

బాల్కొండ: రోడ్డు దాటుతున్న బాలుడిని అతివేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని నందిగల్లీకి చెందిన తోపార్ నిశ్వంత్(7) రోడ్డు దాటుతుండగా భీమ్‌గల్ నుంచి సిరికొండ వైపు వెళ్తున్న టాటా ఏస్ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. నిశ్వంత్ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బాలుడి తల్లి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బాజిరెడ్డి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాజిరెడ్డి, వీజీ గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సమకాలిన రాజకీయ అంశాలపై చర్చించి, జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను కేసీఆర్‌కు వివరించారు. ప్రజాసమస్యలను, ప్రభుత్వ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ, కార్యకర్తల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని ఈ సందర్భంగా కేసీఆర్ వారికి సూచించారు.

# స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్

సుభాష్‌నగర్: ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను ఆదరించి వినియోగించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో స్వదేశీ మేళా కరపత్రాలను ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి 27వ తేదీవరకు స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో స్వదేశీ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంగా ఐదు రోజులపాటు కొనసాగే మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పెట్టుబడిదారులకు సదావకాశమని, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వదేశీ జాగరణ మంచ్ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగ నిపుణులకు వేదికని పేర్కొన్నారు. వ్యవసాయం, చేనేత, వస్త్ర, హస్తకళల ఉత్పత్తులు, సూక్ష్మ, చిన్నతరహా పారిశ్రామిక రంగ ప్రోత్సాహకాలు, ఆయుర్వేదిక్, హోమియోపతి, ఫార్మా, మత్స్య, పాడి పరిశ్రమ, స్వయం ఉపాధిని ప్రోత్సహించే రంగాల స్టాళ్లు ఈ మేళాలో ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని, ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్, స్వదేశీ జాగరణ మంచ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ రాహుల్, ప్రతినిధులు రోషణ్, నవీన్, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూమిని కబ్జా చేస్తున్నారు



అటవీశాఖ అధికారితో మాట్లాడుతున్న ఖైసర్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ నగర శివారులోని అటవీ భూమి కబ్జాకు గురవుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖైసర్ మంగళవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు ప్రతిని అందజేసి డీఎఫ్‌వో వికాస్‌మీనాకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. 12వ డివిజన్‌కు సమీపంలో మౌజం కాలనీ, పెయింటర్ కాలనీ, బాబన్ సహాబ్ పహాడ్ కాలనీల వద్ద ఉన్న ఫారెస్టు భూమిని ఓ కార్పొరేటర్ కబ్జా చేసి ప్రజలను మోసం చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నాడని తెలిపారు. అటవీ భూమిని చదును చేసి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఇళ్లు నిర్మిస్తున్నారని, విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను సయ్యద్ కోరారు.

### 'ప్రజలు బీజేపీని కోరుకున్నారు'

సుభాష్‌నగర్: హర్యానా రాష్ట్రంలో బీజేపీపై వ్యతిరేకత ఉందని అసత్య ప్రచారం చేశారని, రైతులు, జాట్లు, మైనార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ తోపాటు ఇతర పార్టీల కుట్రలను ప్రజలు తిరస్కరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమానికి ప్రజలు మద్దతు పలికారన్నారు. మోదీ, జేపీ నడ్డా, అమిత్ షా హర్యానా ఎన్నికల్లో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా కూడా తెరవలేదని, ఢిల్లీ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు పునరావృతమై బీజేపీ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

## క్రైం కార్నర్

### న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: మద్యం సేవించి డయల్ 100కు కాల్ చేసిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కర్‌పట్ల రాజేశ్ మద్యం సేవించి ఓ కేసు విషయమై ఈ నెల 7వ తేదీన డయల్ 100కు కాల్ చేసి న్యూసెన్స్ చేశాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజేశ్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

### మానవత్వం చాటిన డీఎస్పీ

ఎల్లారెడ్డిరూరల్: బైక్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని డీఎస్పీ శ్రీనివాసులు ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డు కింద పడి పోవడంతో అటుగా వెళ్తున్న డీఎస్పీ గమనించి వెంటనే 108కు సమాచారం అందించి క్షతగాత్రుడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించి మానవత్వం చాటుకున్నారు.

# వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చే మార్గంలేక ముగ్గురు.. ఇల్లరికం వెళ్లిన మరో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు.

**ఆర్థిక ఇబ్బందులతో..**



కిష్టయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన నాయికోటి కిష్టయ్య(55)అనే వ్యక్తి మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కిష్టయ్య ఆరునెలల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఫౌల్ట్రీ ఫామ్‌ను లీజుకు తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులపై తరచూ బాధపడుతున్న కిష్టయ్య.. సోమవారంరాత్రి పౌల్ట్రీ ఫామ్ వద్ద నిద్రించేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పలుచోట్ల వెతికారు. గ్రామశివారులోని ఎయిర్‌టెల్ టవర్ వద్ద ఉన్న చెట్టుకు కిష్టయ్య టవల్‌తో ఉరేసుకొని కనిపించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య నాయికోటి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

**స్వగ్రామానికి వచ్చి..**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కుర్మ రాజు (35) అనే యువకుడు మండల కేంద్రం శివారులో మంగళవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. రాజయ్య ఒన్నాజిపేట్‌కు ఇల్లరికం వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇల్లరికం వెళ్లిన రాజు సదాశివనగర్‌కు వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, కారణాలు తెలియరాలేదన్నారు.

**అప్పు తీర్చే మార్గం లేక..**



రాజలింగం (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): అప్పుల బాధ తాళలేక మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన గాదారి సత్తి రాజలింగం (54) ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజలింగం ఇటీవలే వెల్మల్‌లో ఇంటిని నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతో ఎలా తీర్చాలని మదనపడుతుండేవాడు. ఈ నెల 4వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంతో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు అతడిని నిజామాబాద్ లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు గాదారి సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

### వ్యవసాయంలో నష్టం రావడంతో..

బోధన్‌రూరల్: మండలంలోని కొప్పర్గ గ్రామానికి చెందిన మేకల నాగేశ్ (40) వ్యవసాయంలో నష్టాలు రావడంతో మద్యానికి బానిసై, అప్పుల బాధతో తనపొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయంలో నష్టాలు రావడంతో నాగేశ్ గత కొంత కాలంగా మద్యాని బానిసై ఏ పనీ చేయకుండా అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక గతంలో రెండుమూడుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నెల 7న ఇంట్లో భార్య లేని సమయంలో పొలానికి వెళ్తున్నానని తన కొడుకుకి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు మంగళవారం పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# చేతిలోని డబ్బు లాక్కెళ్లిన దుండగులు

- బ్యాంకు నుంచి వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.84,300 నగదు లూటీ
- నాగిరెడ్డిపేట మండలంలో ఘటన

బ్యాంకుల్లో నుంచి విత్ డ్రా చేసిన డబ్బును దుండగులు ఎత్తుకెళ్లిన ఘటనలు మంగళవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట, బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకున్నాయి. నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లిలో చేతిలోని డబ్బుల కవర్‌ను దుండగులు ఎత్తుకెళ్లగా, బాన్సువాడలో బైక్ కవర్‌లోని రూ.లక్ష మాయం చేశారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బ్యాంకులో నుంచి డబ్బు లు డ్రా చేసి తీసుకెళ్తున్న వ్యక్తి చేతిలోని కవర్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు. క్షణాల్లో రూ.84,300 నగదు లూటీ చేశారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం అక్కంపల్లిలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కంపల్లికి చెందిన జక్కుల రాములు మంగళవారం మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకులో నుంచి రూ.85వేలు డ్రా చేశాడు. అందులో రూ.50 నోట్ల కట్టలో నుంచి 14నోట్లు బాగాలేవనే కారణంతో వాటిని మార్చుకొని రూ.700జేబులో పెట్టుకున్నాడు. మిగిలిన రూ.83,300 ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకొని గోపాల్‌పేట నుంచి ఆటోలో ఇంటికి బయల్దేరాడు. రాములు అక్కంపల్లిలో ఆటో దిగి డబ్బులు ఉన్న కవర్‌ను చేతితో పట్టుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతని చేతిలోని డబ్బుల కవర్‌ను లాక్కెళ్లారు. రాములు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు దుండగులను వెంబడించినప్పటికీ వారు బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

**బైక్ ట్యాంక్ కవర్‌లోని రూ.లక్ష మాయం..**

బాన్సువాడ : బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన రూ.లక్ష నగదు చోరీ అయిన ఘటన మంగళవారం బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన సమీరొద్దీన్ కెనరా బ్యాంకులో రూ.లక్ష నగదు డ్రా చేసి బైక్ పెట్రోల్ ట్యాంకు కవర్‌లో పెట్టారు. సమీరొద్దీన్ సంగమేశ్వర చౌరస్తాలో ఉన్న పాల కేంద్రం వద్ద బైక్‌ను ఆపి పాలను కొనేందుకు వెళ్లగా గమనించిన దుండగుడు నగదును ఎత్తుకెళ్లాడు. సమీరొద్దీన్ తిరిగివచ్చేసరికి బైక్ కవర్‌లోని రూ.లక్ష కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

### దాబాలపై పోలీసుల దాడులు

కామారెడ్డి క్రైం: జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న పలు దాబా హోటళ్లపై జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఆయా చోట్ల నిర్వహించిన దాడుల్లో మద్యం సిట్టింగులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పీఎస్‌ల పరిధిలో చేపట్టిన దాడుల్లో మొత్తం 9 దాబా హోటళ్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సింధు శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని పొందుర్తి క్రాస్ రోడ్డు వద్ద ఓ దాబాపై, దోమకొండ, భిక్కనూరు, లింగంపేట లో 2, గాంధారి, పెద్ద కొడప్‌గల్, బిచ్కుందలోని 2 దాబాలలో సిట్టింగులు నిర్వహిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేవామన్నారు. ఎవరైనా దాబా హోటల్లో మద్యపానం సిట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

దోమకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం భిక్కనూరు వ్యవసాయ కమిటీ చైర్మన్ పాత రాజును ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకులు మనోహర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరే గోపాల్‌రెడ్డిని గౌడ సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కర్రోల్ల శ్యాంసుందర్‌గౌడ్, చంద్రయ్య గారి అనంతరెడ్డి, తీగల తిరుమలగౌడ్, తాటిపల్లి శ్రీకాంత్, సీతారాం మధు, కర్రోళ్ల సంపత్ గౌడ్, పారిపెల్లి సురేష్, ముదాం రాములు తదితరులు పాల్గొన్నారు.



### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మోడెగాం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మాజివాడి చౌరస్తాకు చెందిన బెస్త నవీన్(18) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నవీన్ తన మిత్రుడు నిజాంతో కలిసి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మోడెగాం వెళ్తుండగా గాంధారి వైపు నుంచి పద్మాజివాడి చౌరస్తా వైపునకు అతివేగంతో వస్తున్న కారు ఢీకొట్టి సుమారు 20 మీటర్ల దూరం లాక్కెళ్లింది. నవీన్ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన నిజాంను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**దాబా హోటల్‌లో..**

బోధన్‌టౌన్(బోధన్): పట్టణానికి చెందిన దూపల్లి బాలయ్య(40) అనే వ్యక్తి సోమవారం రాత్రి పట్టణ శివారులోని దాబాలో మృతి చెందాడని పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలయ్య తన మిత్రులు గూండ్ల సాయికుమార్, ద్యాకం శ్రీకాంత్‌తో కలిసి మద్యం సేవించాడని, భోజనం చేసేందుకు నర్సి రోడ్డులోని దాబాకు వెళ్లి స్పృహ తప్పి పోయాడన్నారు. బాలయ్యను అతడి స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారని సీఐ పేర్కొన్నారు. మృతుడి అన్న దూపల్లి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### చెరువులో పడి ఒకరి..



శ్రీనివాస్ (ఫైల్)

వర్ని: చందూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో పడి చాకలి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. సోమవారం రాత్రి బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదని, మంగళవారం ఉదయం ఊర చెరువులో శవమై కనిపించాడన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అమెరికాలో సంబురాల్లో పాల్గొన్న అరవింద్‌రెడ్డి శ్యామల దంపతులు

### అమెరికా, కెనడాలో బతుకమ్మ సంబురాలు

కామారెడ్డి అర్బన్/ కామారెడ్డి రూరల్: అమెరికా హుస్టన్‌లో తెలంగాణ వాసులు బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తు ఇక్కడి సంస్కృతి సాంప్రదాయాలను చాటుతున్నట్టు కామారెడ్డికి చెందిన నిమ్మ అరవింద్‌రెడ్డి శ్యామల దంపతులు తెలిపారు. తాను నివాసం ముండే హుస్టన్ లో ప్రతిరోజు బతుకమ్మ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కామారెడ్డికి చెందిన డాక్టర్ వైద్య సాహితి ఉద్యోగ రీత్యా కెనడాలో ఉంటున్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా కెనడాలోని టొరంటోలో అక్కడి తెలుగు వారితో కలిసి బతుకమ్మ ఆడారు.



కెనడాలో కోలాటం ఆడుతున్న తెలుగువారు